






అమ్మ చేతి విషం..!

కుటుంబ కలహాలతో కాఠిన్యం



సుజాత(ఫైల్)

బిడ్డలకు విషపు గుళికలు ఇచ్చి.. తానూ మింగిన మహిళ

తల్లి, కొడుకు మృతి.. కూతురు పరిస్థితి విషమం



ఇంకా తెల్లవారలేదు. నాన్న ఎప్పటిలాగే నిద్రలేచి.. తోటకు వెళ్లాడు. బయటంతా చలి. అక్క, తమ్ముడు హాయిగా నిద్రపోతున్నారు. అమ్మ నిద్ర లేపుతుంటే.. 'ఇంకా కాసేపు పడుకుంటాం అమ్మా..' అన్నారు గోముగా. 'ఇదిగో.. ఈ మాత్రలు వేసుకుని పడుకోండి..' అంది అమ్మ..! ఇంత పొద్దున్నే మాత్రలేమిటో వారికి అర్థం కాలేదు. వద్దు వద్దు అంటున్నా.. అమ్మ వాటిని మింగించి, నీళ్లు తాపింది. 'ఎందుకమ్మా..?' అంటే.. నులిపురుగులు పోతాయని చెప్పింది. నిజమే అనుకున్నారు. మళ్లీ పడుకుండిపోయారు. అమ్మ కూడా అవే మాత్రలు వేసుకుంది. ఆరోగ్యాన్ని కాపాడేవి కాదు అవి..! నిలువునా ప్రాణాలను హరించేవి. కాసేపటికే కడుపు నొప్పితో అల్లాడిపోయారు అందరూ..! అలా అపస్మారక స్థితిలోకి వెళ్లారు. తెల్లవారింది. ఎంతకీ తలుపులు తీయలేదు. పొద్దున్నే లేచి.. కిరాణం అంగడిని తెరిచేవారు..! అలికిడి లేకపోవడంతో ఇరుగూపొరుగు పిలిచారు. అలికిడి లేకపోవడంతో తలుపులు తెరిచి చూసి.. నిర్ఘాంతపోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. తల్లి సుజాత(38), కొడుకు నాగ చైతన్య(12) ప్రాణాలు కోల్పోయారు. కూతురు రహిత్య చావుబతుకుల నడుమ కొట్టుమిట్టాడుతోంది. ఆ కుటుంబానికి పెద్దగా ఆర్థిక సమస్యలు లేవు. కానీ దంపతుల మధ్య చాలాకాలంగా గొడవలు ఉన్నాయి. అవే.. రెండు నిండు ప్రాణాలను బలిగొన్నాయి. గోరు ముద్దలు తినిపించి ఆకలి తీర్చిన అమ్మ చేయి.. జ్వరమొస్తే మాత్రలు వేసి బాగుచేసిన అమ్మ చేయి.. చివరిసారిగా విషం ఇచ్చింది. గార్లదిన్నెలో ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది.

పెళ్లికి వచ్చి..

రహిత్య చెన్నైలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. బంధువుల ఇంట్లో పెళ్లి ఉండటంతో నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చింది. పెళ్లి వేడుకలు ముగియడంతో బుధవారం రాత్రి తిరిగి వెళ్లేందుకు సిద్ధమైంది. కానీ 'మరులు పెండ్లి చూసుకుని వెళుదువులే..' అని బంధువులు చెప్పడంతో ఆగిపోయింది. అమ్మ ఇచ్చిన విషపు గుళికలు మింగి.. ప్రాణాపాయ స్థితిలో ఉంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను బెంగళూరుకు తరలించారు.

వివరాలు 7లో..


ప్రెస్ వాళ్లకు ఇవ్వాలయ్యా..!

నగర పాలికలో ఓ అధికారి దందా

అక్రమ భవన నిర్మాణదారులే టార్గెట్

50 రోజులలో రూ.25 లక్షల వసూలు..?

వాటాలతో ఉన్నతాధికారుల నోటికి తాళం





ఈ భవంతికే.. బెటర్‌మెంట్ చార్జెస్ ఎగవేసినట్లు ఆరోపణలు



అనంతపురం క్రైం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలను అడ్డుకోవాల్సిన ఆ అధికారి.. వాటిని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఏ భవంతి వద్దకు వెళ్లినా ఆయన 'ప్రెస్'ను వాడుకుంటున్నారు. ఇంతింత వసూళ్లు ఎందుకు..? అని ఎవరైనా అడిగితే.. 'ప్రెస్ వాళ్లకు ఇవ్వాలయ్యా..' అని చెబుతారు. నగరపాలిక టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ఆ ఉన్నతాధికారి వసూళ్ల పర్వానికి హద్దు లేకుండాపోయిందని అంటున్నారు. నగరంలో అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారిగా వాటిపై ఆయన చర్యలు తీసుకోవాలి. కానీ ముడుపులు పుచ్చుకుంటున్నారు. సెట్‌బ్యాక్స్ డీవియేషన్, అదనపు అంతస్తులు, 14 శాతం బెటర్‌మెంట్ చార్జెస్ చెల్లించని వారిని టార్గెట్ చేస్తున్నారు. ఎక్కువగా అలాంటి భవనాలపైనే దృష్టి పెడుతున్నారు. నిబంధనలను అతిక్రమించినందుకు గతంలో పనిచేసిన అధికారులకు ముడుపులు చెల్లించినా.. మళ్లీ ఈయనకు చెల్లించాల్సి వస్తోందట. గతంలో ఇక్కడ పనిచేసిన ఆ అధికారి బాగానే వెనకేసుకున్నారు. ఇప్పుడూ అదే పంథా కొనసాగిస్తున్నారు. నగరపాలిక ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరి వాటా వారికి ఇచ్చేస్తున్నారని, అందుకే ఉన్నతాధికారులు మౌనంగా ఉంటున్నారని ప్రచారం జరుగుతోంది. ఆ సీటులోకి వచ్చిన తక్కువ కాలంలోనే భారీగా సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ) నుంచి ఆయనకు డబ్బు ముడుతోందని సమాచారం. కేవలం 50 రోజుల్లో పాతిక లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. మరో ఏడాది ఆయనే కొనసాగినా ఆశ్చర్యపోనవసరం లేదని నగరపాలిక వర్గాలు అంటున్నాయి.

ఎవరినీ వదలడు..

నగరంలో అక్రమ నిర్మాణాలు జరిగేచోట ఆ అధికారి వాలిపోతున్నారు. ఆదాయం వచ్చే ఏ బిల్డింగ్‌నూ ఆయన వదలడం లేదు. అక్రమ కట్టడం కనిపిస్తే పండుగ చేసుకుంటున్నారు.'ప్రెస్‌వాళ్లకు ఇవ్వాలి..' అని విలేకరుల పేరిట ఆయన వసూలు చేస్తున్నట్లు సమాచారం.

- ఫెర్రర్ నగర్ ప్రధాన రహదారిలో ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. నగరపాలికకు 14శాతం బెటర్‌మెంట్ చార్జెస్ కింద చెల్లించాల్సిన రూ.60 లక్షలను భవన యజమానులు ఎగవేశారు. వారిపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అక్కడ కూడా సార్ కొంత పిండినట్లు సమాచారం.
- సుభాష్ రోడ్డులోని సత్య షోరూమ్ సమీపంలో ఓ భవంతి నిర్మాణ దశలో ఉంది. యజమానుల నుంచి రూ.2లక్షలు పుచ్చుకున్నట్లు సమాచారం.
- సప్తగిరి సర్కిల్ సమీపంలోని ఓ జ్యువెలరీ షోరూమ్ ఎదురుగా భవనాన్ని నిర్మిస్తున్నారు. వారి నుంచి రూ.3లక్షలకు పైగా తీసుకున్నారని తెలిసింది.
- అరవింద నగర్‌లో సెల్లార్ తవ్వినందుకు రూ.2 లక్షలు, రామ్‌నగర్, శ్రీనగర్‌కాలనీలో పరిధిలో రూ.5 లక్షలకు పైగా వసూలు చేసినట్లు తెలిసింది. వీటిలో 90 శాతం ప్రెస్ పేరు చెప్పుకుని వసూలు చేసినవే కావడం గమనార్హం.
- గతంలో తాను పని చేసిన సమయంలో ముడుపులు ఇవ్వకుండా తప్పించుకున్న ఎల్‌టీపీలనూ ఆయన వదల్లేదట. పాత భవంతుల వసూళ్లను ముక్కు పిండి లాక్కున్నట్లు సమాచారం. ఆయన ఫైల్స్ చూడటంలో కీలకంగా పనిచేస్తున్న ఓ ప్లానింగ్ సెక్రటరీ కొత్త బిల్డింగ్ కట్టించే ఎల్‌టీపీలకు నేరుగా ఫోన్ చేస్తాడట. సార్‌కు ఇవ్వాల్సింది ఇవ్వమని..!

పైవారికీ వాటా..!

అవినీతిమయమైన టౌన్‌ప్లానింగ్ అధికారులపై నగరపాలిక ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నగరపాలికలో కీలకంగా వ్యవహరించాల్సిన ఓ ఉన్నతాధికారికి ఈ టౌన్‌ప్లానింగ్ అధికారి నుంచి వాటా వెళుతున్నట్లు సమాచారం. ఎల్‌టీపీఎల నుంచి కూడా ఆయనకు ముడుపులు ముడుతాయట. ఆ ఉన్నతాధికారి పేషీలో పనిచేసే ఓ ఉద్యోగి (టౌన్‌ప్లానింగ్‌కు అనుబంధం) నుంచే ఫోన్లు వెళ్తున్నాయట. దీంతో అటు టౌన్‌ప్లానింగ్ అధికారికి, ఇటు ఉన్నతాధికారికీ ఇవ్వాల్సి వస్తోందని, ఎన్నాళ్లో ఇలా అని బాధితులు తలలు గోక్కుంటున్నారట.

ఉనికి కోసమే జగన్ ధర్నాలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లాఅధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉనికిని కాపాడుకునేందుకే మాజీ సీఎం జగన్ రైతుల పేరుతో ధర్నాలకు పిలుపునిచ్చారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ విమర్శించారు. తనపై వస్తున్న ఆరోపణలను డైవర్ట్ చేసేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని అన్నారు. వైసీపీ కల్లబొల్లి మాటలను రైతులు, జిల్లా ప్రజానీకం నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, పసుపుల హనుమంతురెడ్డితో కలిసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ రైతు వ్యతిరేక విధానాలతో సంక్షోభం తలెత్తిందని అన్నారు. రైతు భరోసా పేరుతో ఏడాదికి దశల వారీగా రూ.7500 మాత్రమే ఇచ్చి, అంతకుముందున్న పథకాలు, సబ్సిడీలను నిలిపేశారని అన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం టాప్‌లో ఉందని అన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలకు పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచుతామని చెప్పి.. ఐదేళ్లలో కేవలం 672 కుటుంబాలకు రూ.47 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో 93.2 శాతం రైతు కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయాయని విమర్శించారు. ఒక్కో రైతు కుటుంబంపై సగటున 2.50 లక్షల అప్పు ఉందని అన్నారు. కౌలు రైతులను ఆదుకుంటామని మోసగించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు రుణమాఫీ చేశామని, 7 లక్షల మందికి గుర్తింపు కార్డులు ఇచ్చామని అన్నారు. 2022-23 రబీలో పంటల బీమా చెల్లించకుండా జగన్ రైతులను ముంచాడని మండిపడ్డారు. ధాన్యం సేకరణలోనూ రైతులకు అన్యాయం చేశారని అన్నారు. వరి సాగుకు ఎకరానికి రూ.60 వేలు ఖర్చవుతుంటే రూ.6 వేలు మాత్రమే వైసీపీ ప్రభుత్వం పరిహారం ఇచ్చిందని అన్నారు. వైసీపీ నేతలు, దళారులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను దోచుకున్నారని ఆరోపించారు. 2800కిపైగా నకిలీ ఖాతాలు సృష్టించి రూ.120 కోట్ల అవినీతికి పాల్పడ్డారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో లక్ష టన్నుల ధాన్యం సేకరిస్తే.. కూటమి ప్రభుత్వంలో ఇదే సమయానికి 25 లక్షల టన్నుల ధాన్యం సేకరించామని అన్నారు. ధాన్యం సొమ్ము చెల్లించేందుకు మూడు నెలలు తీసుకున్నారని, తమ ప్రభుత్వంలో 48 గంటల్లోనే రైతుల ఖాతాలకు జమ చేస్తున్నామని అన్నారు. సూపర్ సిక్స్‌లో ఇప్పటికే నాలుగు హామీలు నెరవేర్చామని అన్నారు. వ్యవసాయం, అనుబంధ శాఖలకు రూ.43,402 కోట్లు బడ్జెట్ కేటాయించామని, రైతుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధి అది అన్నారు. రైతులకు న్యాయం చేసేది కూటమి ప్రభుత్వమేనని అన్నారు.

నోటి దురుసుపై విచారణ

తాటిచెర్ల పాఠశాలకు డిప్యూటీ డీఈఓ

అనంతపురం విద్య, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మెగా పీటీఎం నిర్వహించిన రోజున తాటిచెర్ల పాఠశాలలో నోరు పారేసుకున్న వైఎస్‌ఆర్‌టీఏ రాష్ట్ర నాయకుడు అశోక్‌కుమార్ వ్యవహారంపై అనంతపురం డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు విచారించారు. ఆయన గురువారం పాఠశాలకు వెళ్లి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఆ రోజు ఏం జరిగిందని వివరాలు సేకరించారు. అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల జడ్పీ హై స్కూల్‌లో ఈ నెల 7న మెగా పీటీఎం నిర్వహించారు. స్కూల్ టీచర్, వైఎస్‌ఆర్‌టీఏ నాయకుడు అశోక్ కుమార్ రెడ్డి తరగతి గదిలోనే విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. డీఈఓ ప్రసాద్‌బాబు విచారణకు ఆదేశించారు. కానీ పలు కారణాల వల్ల అనంతపురం డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు విచారణకు వెళ్లలేదు. ఎట్టకేలకు గురువారం విచారణకు దిగారు. మధ్యాహ్నం సుమారు 1.30 గంటల నుంచి సాయంత్రం వరకూ ఆయన పాఠశాలలో గడిపారు. వివిధ తరగతుల విద్యార్థులను ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడారు. టీచర్ అశోక్ పాఠశాలకు సక్రమంగా రాకపోవడం, ఇతర వివాదాలను విద్యార్థులు డిప్యూటీ డీఈఓకి వివరించినట్లు తెలిసింది. తర్వాత ఉపాధ్యాయులను సైతం వేరుగా కూర్చోబెట్టి విచారించారని తెలిసింది. విచారణ జరిగిందని, వివరాలను బయటకు చెప్పలేమని డీవైఈఓ అన్నారు. మరో రెండు రోజుల్లో నివేదికను డీఈఓకు అందజేస్తామని తెలిపారు.

బిగుస్తున్న ఉచ్చు

కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌పై విమర్శలు గుప్పించిన అశోక్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వివరాలను సేకరించారు. ఈ నెల 7న జరిగిన వివాదం, దురుసు మాటలను ధ్రువీకరించుకున్నారు. డిప్యూటీ డీఈఓ సైతం అశోక్ తీరు గురించి క్లారిటీకి వచ్చినట్లు తెలుస్తోంది. విద్యాశాఖ రాష్ట్ర కమిషనరేట్ అధికారులు కూడా విచారణకు సిద్ధమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది.



సుబ్బయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య లీలావతి

అమర జవానుకు కన్నీటి వీడ్కోలు

జనసంద్రంగా మారిన నార్పల

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

(7లో....)





అమరావతిలో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లాకు చెందిన మంత్రులు సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, సవిత, ఎస్పీ జగదీశ్, కలెక్టర్ వినోద్‌కుమార్



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

గుంతకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): హనుమద్దీక్షల్లో భాగంగా చివరి రోజు గురువారం ఉదయం హనుమద్ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. హనుమాన్ మాలా ధారులు ఇరుముడులతో గుంతకల్లులోని బళ్లారి బైపాస్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయం వద్దకు చేరుకున్నారు. స్వామివారిని అలంకరించి తేరుపై ఆశీనులను చేసి, ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. హనుమాన్ భక్తులతో కలసి టీడీపీ నాయకులు కసాపురం ఆలయం వరకూ ఏడు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. యువతుల సాంస్కృతిక ప్రదర్శనలు, కేరళ కళాకారుల మృదంగ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నెట్టికంటి ఆలయానికి చేరుకున్న హనుమాన్ భక్తులు ఇరుముడులను సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో గురువారం రాత్రి నిద్రచేశారు. కార్యక్రమంలో కసాపురం దేవస్థాన ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ, టీడీపీ నాయకులు శ్రీనాథ్‌గౌడు, గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారంలో నెట్టికంటి ఉత్సవ విగ్రహం.. భక్తుల కోలాటం





సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్ఓ

వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణపై స్థానిక పంపనూరు నగరవనంలోని అతిథి గృహంలో అనంతపురం డివిజన్ అటవీశాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నాగార్జున సాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వుకు సంబంధించిన సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఎన్ఎస్‌టీఆర్ - ఏసీఎఫ్ ధనరాజ్ సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్ అప్పా పెట్రోలింగ్ యాప్, కెమెరా ట్రాప్ ఆపరేషన్ ద్వారా అడవిలో వన్యప్రాణుల గుర్తింపు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో రేంజర్లు శ్రీనివాసులు, మధుబాబు, సెక్షన్ ఆఫీసర్స్ అక్బర్, నారపరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన బాలికల జట్టు



చక్రిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ఆంధ్రా-15 బాలికల జట్టు సెమీస్‌కు చేరింది. బీసీసీఐ ఆధ్వర్యంలో జైపూర్‌లో జరుగుతున్న పోటీల్లో గుజరాత్‌తో ఆంధ్రా-15 బాలికల జట్టు తలపడింది. ఆంధ్రా మొదట బ్యాటింగ్ చేసి 35ఓవర్లలో ఆరు వికెట్లకు 187పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన గుజరాత్ 31.5ఓవర్లలో 164పరుగులకు ఆలౌట్ అయి ఓటమిపాలైంది. ఇందులో ఆంధ్రా జట్టులోని జిల్లా క్రీడాకారిణి చక్రిక మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. దీంతో ఆంధ్రా జట్టు సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది.

స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. మైసూర్‌లో గురువారం నిర్వహించిన 62వ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ఏపీ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారులు హంజహుస్సేన్, హార్థిక్‌రెడ్డి, సుచీత్‌రెడ్డి కాంస్యపతకాలు సాధించారు. సుచీత్‌రెడ్డి మరో రజత పతకం సాధించారు. విజేతలతో పాటు చీఫ్‌కోచ్ నాగేంద్ర, కోచ్‌లు అనీల్‌కుమార్, హేమంత్‌కుమార్, అఖిల్, నరసింహ, ఆనంద్‌ను జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రవిబాబు అభినందించారు.

హెచ్చెల్సీకి నీటి పండుగ



శిథిలావస్థకు చేరిన హెచ్ఎల్ఎంసీ

11పనులకు రూ.36 కోట్లు మంజూరు

కాలువ పటిష్టతకు అడుగులు

సామర్థ్యం పెంపునకు గ్రీన్ సిగ్నల్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న తుంగభద్ర ఎగువకాలువ (టీబీపీ హెచ్చెల్సీ)కు పూర్వవైభవం రానుంది. ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన హెచ్చెల్సీ సామర్థ్యాన్ని పెంచుతూ పటిష్ట పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకుగాను ప్రాధాన్యత కింద 11పనులను గుర్తిస్తూ రూ.36 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం 1800 క్యూసెక్కులుగా ఉన్న హెచ్చెల్సీ సామర్థ్యం పనులు పూర్తయితే 2500క్యూసెక్కులకు పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. చాలా చోట్ల బ్రిడ్జిలు, అండర్ టన్నెల్, రెగ్యులేటర్లు కూలిపోయాయి. అటువంటి ప్రాధాన్యత పనులు వచ్చే ఏడాది సీజన్‌లోపు పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే గుర్తించిన 11పనులకు సంబంధించి టెండర్లు వేశారు. జనవరి, ఫిబ్రవరిలలో పనులు ప్రారంభించేందుకు ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు.

11పనులకు రూ.36కోట్లు మంజూరు


రాష్ట్ర ప్రభుత్వం హెచ్చెల్సీకి అత్యంత ప్రాధాన్యత కింద 11పనులను చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన రూ.36కోట్లు నిధులను మంజూరు చేసింది. ఇందులో ప్రధానంగా హెచ్ఎల్ఎంసీ 165.028 కిలోమీటర్ వద్ద సగంలో ఆగిన బ్రిడ్జిని పూర్తి చేయడానికి రూ.1.59కోట్లు కేటాయించారు. 169.400కిలోమీటర్ వద్ద వంతెన నిర్మాణానికి రూ.1.91కోట్లు మంజూరు చేశారు. 155.81కిలోమీటర్ వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణానికి రూ.1.53కోట్లు కేటాయించారు. 115.167కిలోమీటర్ వద్ద వంతెన పూర్తి చేయడానికి రూ.1.66కోట్లు కేటాయించారు. 117.794కిలోమీటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80కోట్లు, 147.395కిలోమీటర్ వద్ద పెండింగ్‌లో ఉన్న అవుట్‌పాల్ రెగ్యులేటర్ పూర్తి చేయడానికి రూ.4.21కోట్లు కేటాయించారు. 137.702కిలో మీటర్ వద్ద అండర్ టన్నెల్ పునర్నిర్మాణానికి రూ.4.21కోట్లు మంజూరు చేశారు. 189.126కిలోమీటర్ వద్ద పీఏబీఆర్ లింకుచానల్ పునర్ నిర్మాణానికి రూ.4.10కోట్లు కేటాయించారు. 189.126 కిలోమీటర్ వద్ద ఎంపీఆర్ రెగ్యులేటర్ ఓటీ మోపిడి వద్ద రెగ్యులర్ నిర్మాణానికి రూ.4.14కోట్లు మంజూరు చేశారు. 115 కిలోమీటర్ నుంచి 130కిలోమీటర్ వరకు లైనింగ్ నిర్మాణానికి రూ.9.80కోట్లు కేటాయించారు. కణేకల్లు చెరువు ఒకటో కిలోమీటర్ వద్ద ఆఫ్‌టెక్ స్లూయిస్-3 నిర్మాణానికి రూ.22లక్షలు కేటాయించారు.

ఐదేళ్ల పాటు నిర్లక్ష్యం

గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం జిల్లాకు తాగు, సాగునీటిని అందించే హెచ్చెల్సీని పూర్తిగా విస్మరించింది. హెచ్చెల్సీ నిర్వహణకు ఒక్క పైసా కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. జలవనరుల శాఖ అధికారులు మూడేళ్లలో ఐదుసార్లు హెచ్చెల్సీ పనుల కోసం ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు. పైగా మంజూరైన పనులను సైతం రద్దు చేశారు. దీంతో హెచ్చెల్సీ నిర్వహణ ఇంజనీర్లకు భారంగా మారింది.



వర్షపు నీటికే పడిన గండి



గడువులోపు పనులు పూర్తి: రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ

గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయలేదు. తాజాగా పంపిన ప్రతిపాదనలకు అంగీకారం తెలిపారు. మొత్తం 11పనులకు సంబంధించి రూ.36కోట్లు నిధులు కేటాయించారు. ఏడు నెలల్లో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే టెండర్లను ఆహ్వానించాం. జనవరిలో అగ్రిమెంట్లు పూర్తి చేసి, ఫిబ్రవరిలో పనులు ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది టీబీ డ్యాం నుంచి నీటి విడుదల పూర్తి అయ్యే సమయం లోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచిస్తాం. వచ్చే జూన్, జూలై నెలల్లోపు ప్రభుత్వం సూచించిన పనులను పూర్తి చేసి కాలువ పటిష్టతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.



సీజ్ చేసిన బియ్యంతో అధికారులు

రేషన్ బియ్యం స్వాధీనం

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రెండు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అశోక్‌లైల్యాండ్ వాహనంలో 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కర్ణాటకలోని బంగారుపేటకు తరలిస్తుండగా.. పెనుకొండ మండలం గుట్టూరులోని సర్కిల్‌లో స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. అలాగే పెనుకొండ సమీపంలోని కియా ప్లాంట్ వద్ద మహేంద్ర గూడ్స్ వాహనంలో తరలిస్తున్న 18 క్వింటాళ్ల బియ్యాన్నీ సీజ్ చేశామన్నారు. వాటిని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో ఏఓ వాసుప్రకాష్, పెనుకొండ సీఎస్‌డీటీ ప్రభావతి పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా



మంత్రి పయ్యావుల

ఉరవకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో శనివారం ఉరవకొండలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రూరల్ సీఐ చిన్నగౌస్, ఎస్ఐ జనార్దననాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాబ్‌మేళాకు ఐదువేల మందికి పైగా నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 68కిపైగా కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయి. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. శుక్రవారం కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశముందని, బయోడేటా, వివరాలను 95022 36524 నెంబర్‌కు వ్యాట్సాప్ చేయాలని సూచించారు.

ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. గురువారం ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి తన కార్యాలయంలో మాజీ రిజిస్ట్రార్ శశిధర్‌తో కలిసి వాటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రథమ సెమిస్టర్ (ఆర్23) విద్యార్థులకు రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించామని, ఈ పరీక్షలు నిర్వహించిన వారం రోజుల్లోనే ఫలితాలు విడుదల చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డీసీఈ లలితకుమారి, విభాగాధిపతులు భారతి, మమత, భువనవిజయ, కళ్యాణ్‌కుమార్, రామశేఖర్‌రెడ్డి, బాలనరసయ్య, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

పంటల బీమాకు మూడు రోజులే గడువు

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటల బీమా వర్తింపునకు ప్రీమియం చెల్లించేందుకు మరో మూడు రోజులే సమయం ఉందని, ఈ విషయాన్ని రైతులకు తెలియజేసి ప్రీమియం కట్టేలా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏడీఏలు, ఏఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీ ఈ పంట నమోదును పక్కాగా చేసేలా చొరవ చూపాలన్నారు. రెండు రోజుల్లో తుఫాన్ ఉన్నందున ఈ సమయంలో పంట కోతలు కోయకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సివిల్‌సప్లై కార్పొరేషన్ ఆధ్వర్యంలో వరి పంట కొనుగోలు ప్రారంభమైందని, వరి పంట విక్రయించేందుకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి, పంటల సాగు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓలు వెంకట్‌కుమార్, రాకేష్ నాయక్, బాలూ నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

16న రైల్వే పెన్షన్ అదాలత్

గుంతకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైల్వే జోనల్ పరిధిలోని ఆరు డివిజన్లలో పెన్షన్ అదాలత్‌లను సోమవారం నిర్వహిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఏ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధిలోని సికింద్రాబాదు, హైదరాబాదు, గుంతకల్లు, విజయవాడ, గుంటూరు, నాందేడ్ డివిజన్లలోనూ, వివిధ వర్క్‌షాప్‌లలోనూ ఈ పెన్షన్ అదాలత్‌ను నిర్వహిస్తారన్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

రైల్వే ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ గెలుపు

గుంతకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైల్వే ఉద్యోగ సంఘం గుర్తింపు కోసం ఈ నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించిన ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ విజేతగా నిలిచింది. గురువారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో మొత్తం 14,359 ఓట్లకుగానూ 12,364 ఓట్లు పోలయ్యాయి. వాటిలో ఎంప్లాయీస్ సంఘ్ 5,966 ఓట్లతో మొదటి స్థానంలో నిలవగా, 5,723 ఓట్లతో మజ్దూర్ యూనియన్ రెండో స్థానంలో నిలిచింది. దీంతో ఎంప్లాయీస్ సంఘ్ 243 ఓట్ల మెజారిటీతో గెలుపు సాధించింది. సంఘ్ నాయకులు కౌంటింగ్ హాల్ నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ.. రైల్వే ఉద్యోగులు, కార్మికులు తమ సంఘంపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలుపుకుంటామని, కార్మిక పక్ష పోరాటాలను ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. కాగా ఎన్నికల్లో డీఎంఆర్‌కేఎస్ సంఘానికి 372, ఐఆర్ఎంయూకు 132, ఆర్ఎంయూకు 628 ఓట్లు రాగా, 113 ఓట్లు ఇన్‌వ్యాలిడ్‌గా తేలాయి. దక్షిణ మధ్య రైల్వే మొత్తం మీద ఎంప్లాయీస్ సంఘ్ కంటే మజ్దూర్ యూనియన్ అధిక ఓట్లను సాధించింది. జోన్ మొత్తం మీద సంఘ్ కంటే యూనియన్ 3,087 ఓట్ల ఆధిక్యాన్ని సాధించింది.



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ్ నాయకులు

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 12(డిసెంబరు): జిల్లాలోని పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని పెద్ద వడుగూరు, పామిడి పంచాయతీల్లో ఆయన తనిఖీలు చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించిన లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ శిక్షణ కార్యక్రమంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అదే నిర్లక్ష్యం..!

రెవెన్యూ సదస్సుల్లో కనిపించని చిత్తశుద్ధి



కళ్యాణదుర్గం ప్రాంతంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

అక్కడే సమస్యకు పరిష్కారం.. అంతా తూచ్

గ్రీవెన్స్‌లాగేనే ఫిర్యాదుల స్వీకరణ.. ఆపై మౌనం

రోజువారీ సమాచారం ఇవ్వాలని సర్కారు ఆదేశాలు

అయినా పట్టించుకోని జిల్లా యంత్రాంగం

కలెక్టరేట్‌లో సమన్వయలోపం

అనంతపురం టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలను త్వరగా పరిష్కరించాలనే ఉద్దేశంతో కూటమి సర్కారు రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. ఈనెల 6న జిల్లాలో రెవెన్యూ సదస్సులను అట్టహాసంగా ప్రారంభించింది. తొలిరోజు 35 రెవెన్యూ గ్రామసభలను నిర్వహించగా.. 456 ఫిర్యాదులు వచ్చాయి. ఇలా జిల్లాలో 34 రోజుల్లో 540 రెవెన్యూ గ్రామాల్లో ఈ సదస్సులను ప్రభుత్వం నిర్వహించింది. అయితే అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో.. వారు సమస్యలపై అదే నిర్లక్ష్యం చూపుతున్నారు.

తొలి రోజున నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 456 ఫిర్యాదులు రాగా.. అందులో కేవలం 18 ఫిర్యాదులను మాత్రమే అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వాటిపై అదే నిర్లక్ష్యం.

● వైసీపీ అరాచకాలు

వైసీపీ హయాంలో అనేక భూములు, స్థలాలను ఆన్‌లైన్‌లో మార్చడం, నకిలీపాస్ పుస్తకాలు తయారుచేయడం, బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొందడం.. తదితర అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో అనేకమంది రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. ఈ సదస్సుల ద్వారా తాము అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న భూముల సమస్యలు, కష్టాలు తీరుతాయని రైతులు, ప్రజలు ఆశించారు. ఆ సదస్సుల్లో ఫిర్యాదులు చేశారు. అయితే ఆ సమస్యలను పరిష్కరించడానికి అధికారులు పెద్దగా శ్రద్ధ చూపడంలేదు.

● సమాచారం ఏదీ..?



ఈ సదస్సుల్లో వచ్చే ఫిర్యాదులు, వాటి పరిష్కార విషయాలను ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ వివరాలను పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించింది. ఏగ్రామంలో సదస్సు జరిగితే ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.. ఎన్ని పరిష్కరించారో చెప్పాలని.. అలాగే జిల్లా స్థాయిలో కలెక్టరేట్ నుంచి ప్రతిరోజు రెవెన్యూ సదస్సుల సమాచారం జిల్లాస్థాయి మీడియాకు తెలపాలని ఆదేశించింది. అయితే రెవెన్యూ సదస్సుల సమాచారం ఇవ్వడంలో అధికారులు ఏమాత్రం చిత్తశుద్ధి చూపడంలేదు. కనీసం జిల్లాస్థాయిలో కలెక్టరేట్‌లో కూడా ఈ విషయంలో అధికారుల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సెక్షన్ ఆఫీసర్లకు ఫోన్‌చేస్తే.. తాము చెప్పడానికి లేదని, డీఆర్‌ఓ ఆ సమాచారం చెబుతారని అంటున్నారు. ఈ డీఆర్‌ఓ తొలిరోజునే.. అది కూడా పదిసార్లు ఫోన్‌చేస్తే ఆ రోజు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత జరిగే ఏ ఒక్క రెవెన్యూ సదస్సు సమాచారం చెప్పలేదు. కనీసం ఫోన్ కూడా ఎత్తడంలేదు. కలెక్టరు అయినా ఫోన్ చేస్తే.. అడిగినదానికి సమాచారం ఇస్తుంటే... కలెక్టరేట్ అధికారులు మాత్రం కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదు. సమస్యల పరిష్కారం అటుంచి.. కనీసం వాటి సమాచారమైనా ఇవ్వడానికి అధికారులు ఆసక్తి చూపడంలేదు. దీంతో గ్రీవెన్స్‌లాగే ఈ రెవెన్యూ సదస్సు కార్యక్రమం కూడా అబాసుపాలు కాక తప్పదని రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భారీగా నీరు వృథా



జల్లిపల్లి సమీపంలోని అండర్ చానల్ వద్ద నీటి వృథా



వంకలో వృథాగా పారుతున్న నీరు

శిథిలావస్థలో పీఏబీఆర్ కుడికాలువ

చానల్స్ వద్ద పెద్ద ఎత్తున లీకేజీలు

తగ్గిన నీటి వేగం

చివరి చెరువులకు నీరు చేరేనా..?

కూడేరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడికాలువ నుంచి నీరు పెద్ద ఎత్తున వృథా అవుతూ వంకల్లోకి వెళ్తోంది. కాలువకు అండర్ చానల్స్ ఉన్న ప్రదేశాల్లో నీరు లీకేజీ అవుతోంది. దీంతో కుడికాలువలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. పీఏబీఆర్ నుంచి కుడికాలువకు గురువారం 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. కూడేరు వద్దకు వచ్చే సరికి కాలువలో నాలుగు వందల క్యూసెక్కుల నీరు కూడా ప్రవహించడం లేదు. డ్యాం నుంచి కుడికాలువ నాలుగో కిలోమీటర్ సమీపంలోని అండర్ చానల్ వద్ద పెద్ద ఎత్తున నీరు వంకల పాలవుతోంది. కుడికాలువ 112 కిలోమీటర్లు ఉండగా గురువారం రాత్రికి 98 కిలోమీటర్లకు నీరు చేరే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కూడేరు మండలంలోని వివిధ ప్రదేశాల్లో కాలువలో నీరు వృథా కారణంగా దిగువకు నీరు వేగంగా సాగడం లేదు. ఈ నెల రెండో తేదీన కుడికాలువ నీరు విడుదల చేయగా.. పది రోజులు అవుతున్నా వంద కిలోమీటర్లకు కూడా ఆ నీరు చేరలేదు. కుడికాలువ ద్వారా దాదాపు 49 చెరువులకు నీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 3.266 టీఎంసీల నీరు నిల్వ ఉందని, తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్‌లోకి 500 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

వైసీపీ పాలనలో కుడికాలువకు మరమ్మతులు చేయడానికి పైసా కూడా విడుదల చేయలేదు. అంతేకాకుండా కాలువలో అండర్ చానల్ ఉన్న ప్రాంతాలు దెబ్బతినడంతో నీరు వృథా అవుతోంది. కాలువలో కంపలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటి కారణంగా కాలువలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. ఏటా కాలువకు నీరు విడుదల చేసే సమయంలో కాలువ గట్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించడంతో పాటు కాలువకు మరమ్మతులు చేసేవారు. వైసీపీ పాలనలో ఐదేళ్లలో వీటికి నిధులు విడుదల చేయకపోవడంతో కాలువ శిథిలావస్థకు చేరుకుంది. కాలువలో నీటి వేగం పూర్తిగా తగ్గిందని డీసీ డివిజన్ ఈఈ అబ్దుల్ షామీ తెలిపారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.14

అనంతపురం రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 12తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.27వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 27వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 18వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 39 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి ప్రైమరీ పాఠశాల హయ్యర్ సెకండరీ స్కూలు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విద్యాసంస్థల యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఒకటో తరగతి, ఇంటర్ ప్రవేశానికి జనవరి ఒకటో తేదీ నుంచి 31 లోగా www.ssshss.edu.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫీజు రూ.100 ఎస్‌బీఐలో చెల్లించాలని సూచించింది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ధర్మవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మరణించింది. కర్ణాటక రాష్ట్రం దొడ్డబళాపూర్‌కు చెందిన నాగమణి (46), సోమశేఖర్ చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. శుభకార్యం కోసం వారు పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి ద్విచక్రవాహనంలో వచ్చారు. శుభకార్యం ముగించుకుని బైక్‌పై స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో వెళ్తుండగా... ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో నాగమణి తీవ్రంగా, సోమశేఖర్ స్వల్పంగా గాయపడ్డారు. నాగమణిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగమణి మరణించింది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


ఈరేష్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్ రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి కే ఈరేష్ (43) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇతను స్థానిక రైల్వే షెడ్‌లో టెక్నీషియన్. కొన్ని రోజులుగా అతను తలనొప్పితో బాధపడుతున్నాడు. అతని భార్య నాగలక్ష్మి ఆస్థమాతో బాధపడుతోంది. ఇరువురి చికిత్స కోసం ఈరేష్ రూ.10 లక్షలు అప్పు చేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఈరేష్ బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన నాగలక్ష్మి పోలీసులకు సమాచారం ఇచ్చింది. మృతదేహాన్ని పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కాగా, ఈరేష్‌కు ఒక కుమారుడు ఉన్నాడు.


రోదిస్తున్న సుబ్బయ్య తల్లి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రావణి, అలం


సుబ్బయ్య మృతదేహం వద్ద కుమారుడు, కుమార్తె


సుబ్బయ్యకు చివరిసారిగా సెల్యూట్ చేస్తున్న భార్య, పిల్లలు

అమర జవానుకు కన్నీటి వీడ్కోలు

జనసంద్రంగా మారిన నార్పల
సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు


సుబ్బయ్యకు గౌరవ వందనం సమర్పిస్తున్న ఆర్మీ అధికారులు

నార్పల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తోటి సైనికుల ప్రాణాలను కాపాడి, వీర మరణం పొందిన జవాను వెంకట సుబ్బయ్య అంతిమ యాత్రకు జనం పోటెత్తారు. అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలోని వ్యవసాయ భూమిలో గురువారం ఆయన అంత్య క్రియలను సైనిక లాంచనాలతో పూర్తి చేశారు. నార్పల మండలంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. సుబ్బయ్య అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ అంతిమయాత్రలో పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరై.. జోహార్లు అర్పించారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, పార్టీ నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ఆకుల విజయ్‌కుమార్‌బాబు, పిట్టు రంగారెడ్డి, వైసీపీ నాయకులు సత్యనారాయణ రెడ్డి తదితరులు సుబ్బయ్యకు ఘన నివాళులు అర్పించారు. జవాన్ సుబ్బయ్య భౌతిక కాయానికి కప్పిన జాతీయ జెండాను ఆయన భార్య, తల్లికి ఆర్మీ అధికారులు అందజేశారు. ఆర్మీ అధికారులు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించడంతోపాటు అన్నివిధాలుగా తోడ్పాటును అందజేస్తామని ఆర్డీఓ కేశవనాయుడు తెలిపారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా సైనిక సంక్షేమ అధికారులు తిమ్మప్ప, రఫీ, డీప్యూటీ తహసీల్దారు శ్రీనివాసమూర్తి, మాజీ సైనిక అధికారులు అంత్యక్రియలలో పాల్గొన్నారు.

కన్నీటి సంద్రం

సుబ్బయ్య భౌతికకాయం వద్ద చివరి రోజున భార్య లీలావతి, ఇద్దరు పిల్లలు నిఖిల్ సాయి, ప్రియ కన్నీరు మున్నీరయ్యారు. 'డాడీ.. మాతో మాట్లాడు డాడీ.. పైకి లే' అంటూ చిన్నారులిద్దరూ తమ తండ్రిని తట్టిలేపేందుకు ప్రయత్నించడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. 'వచ్చే సోమవారం వస్తానని ఫోన్‌లో చెబితివి కదా..? ఆ రోజు కోసం ఎంతగా ఎదురుచూశాను..? గంటలను లెక్కపెట్టుకుంటిని కదా..? చివరకు శవమై వచ్చవా..' అంటూ లీలావతి బోరున విలపించారు. తన భర్త భౌతిక కాయంమీద పడి వెక్కివెక్కి ఏడ్చారు.

కాంట్రాక్టర్ హత్య

ఆర్థిక లావాదేవీలు..
వివాహేతర సంబంధమే
కారణమని అనుమానం


రాజశేఖర్ (ఫైల్)

కొత్తచెరువు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైలేపల్లి సమీపంలో దారుణ హత్య జరిగింది. నల్లమాడ మండలం బొగ్గలపల్లి గ్రామానికి చెందిన గాండ్ల రాజశేఖర్(49) అనే వ్యక్తిని మైలేపల్లి చెరువు సమీపంలోని ఫాం హౌస్ వద్ద గురువారం హత్య చేశారు. సీఐ ఇందిర తెలిపిన వివరాల మేరకు, రాజశేఖర్ విద్యుత్ కాంట్రాక్టు పనులను చేస్తుంటారు. విద్యుత్ పరికరాలను నిల్వ చేసుకునేందుకు మైలేపల్లి చెరువు సమీపంలో, బెంగళూరు నగర మాజీ మేయర్ విజయ్‌కుమార్ ఫాంహౌస్‌ను లీజుకు తీసుకున్నారు. రాజశేఖర్ వద్ద పనిచేస్తున్న వారు ఆ ఫాంహౌస్‌లో ఉంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి రాజశేఖర్‌ను కారులో ఎత్తుకుపోయారు. ఈ విషయాన్ని అక్కడ పనిచేసే యువకులు డయల్ 100కు తెలియజేశారు. పోలీసులు ఫాంహౌస్ వద్దకు వెళ్లి సమాచారం సేకరించారు. రాజశేఖర్ కోసం పరిసర ప్రాంతాలలో గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో ఆ యువకులను స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు సేకరించారు. ఆ తరువాత ఫాంహౌస్ వద్దకు వెళ్లేసరికి తీవ్ర గాయాలతో రాజశేఖర్ మృతిచెంది కనిపించాడు. అతని ఒంటిపై దుస్తులు లేవు. విషయం తెలుసుకున్న రాజశేఖర్ భార్య సువర్ణ, కూతురు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చిత్తూరు జిల్లాలో పనిచేసే కానిస్టేబుల్ సాయిప్రతాప్ రెడ్డి (9వ బెటాలియన్), అతని బావమరిది రవీంద్రారెడ్డిపై వారు అనుమానం వ్యక్తం చేశారు. సాయిప్రతాప్‌రెడ్డి బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తనకు ఫోన్ చేశాడని, తన భర్త గురించి అడిగారని రాజశేఖర్ భార్య పోలీసులకు తెలిపారు. పెనుకొండ మండలం వెంకటగిరి పాలెంకు చెందిన రవీంద్రారెడ్డి, ఆయన భార్య రాధికకు తన భర్త రూ.5 లక్షలు ఇచ్చారని, ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలని వారిని అడుగుతుండేవారని తెలిపారు. ఆ డబ్బులు అడగవద్దని సాయిప్రతాప్ రెడ్డి తన భర్తను హెచ్చరించేవారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యకు వివాహేతర సంబంధం కారణమా, ఆర్థిక లావాదేవీలు కారణమా అన్నది తేలాల్సి ఉందని సీఐ తెలిపారు. పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అమ్మ చేతి విషం..!

కుటుంబ కలహాలతో కాఠిన్యం
బిడ్డలకు విషపు గుళికలు ఇచ్చి..
తానూ మింగిన మహిళ
తల్లి, కొడుకు మృతి..
కూతురు పరిస్థితి విషమం


రహిత్యను చికిత్స నిమిత్తం తరలిస్తున్న బంధువులు

గార్లదిన్నె, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య విభేదాలు రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నాయి. మరొకరు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. గార్లదిన్నె మండల కేంద్రంలో సుజాత(38) తన కూతురు రహిత్య, కుమారుడు నాగ చైతన్య(12)కు విషపు గుళికలు మింగించి, తాను తీసుకున్నారు. తల్లీకొడుకు మృతిచెందగా, రహిత్య పరిస్థితి విషమంగా మారింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు గార్లదిన్నె మండలం ఎర్రగుంట్లకు చెందిన నిమ్మకాయల సురేష్, సుజాత దంపతులకు 8 ఎకరాల చీనీతోట ఉంది. వ్యవసాయం చేస్తు జీవనం కొనసాగించేవారు. వీరికి కూతురు రహిత్య, కుమారుడు నాగ చైతన్య ఉన్నారు. ఐదేళ్ల క్రితం ఎర్రగుంట్ల నుంచి గార్లదిన్నెకు వలస వచ్చారు. అద్దె ఇంట్లో ఉంటూ కిరాణం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. రహిత్య చెన్నైలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. నాగచైతన్య గార్లదిన్నె విద్యా నికేతన్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. దంపతుల మధ్య కొన్నాళ్లుగా విభేదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. బంధువుల ఇళ్లలో ఏ శుభకార్యం జరిగినా వీరి ఇంట్లో చిన్నపాటి గొడవలు జరిగేవని తెలిసింది. ఈ క్రమంలో బంధువుల వివాహక వేడుకల్లోనూ బుధవారం ఇద్దరూ గొడవపడినట్లు తెలిసింది. ఇంటికి వచ్చాక బుధవారం రాత్రి కూడా గొడవ కొనసాగినట్లు సమాచారం. సురేష్ గురువారం తెల్లవారుజామున చీనీతోటలో పనుల నిమిత్తం ఎర్రగుంట్లకు వెళ్లారు. ఆ సమయంలో సుజాత విషపు గుళికలను తీసుకుని నిద్రమత్తులో ఉన్న కొడుకు, కూతురుకు తినిపించి నీళ్లు తాపించింది. ఆ తరువాత తాను కూడా విషపు గుళికలను మింగింది. గుళికలు వద్దని పిల్లలు అంటున్నా, నులి పురుగుల మాత్రలు అని నమ్మించి తినిపించింది. గురువారం ఉదయం ఎంతసేపటికీ దుకాణం తెరవకపోవడంతో పక్కింటి వారు వెళ్లి తలుపు తీసి చూశారు. అపస్మారక స్థితిలో ఉన్న ముగ్గురినీ చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ తరువాత నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుజాత మృతి చెందింది. మెరుగైన చికిత్స నిమిత్తం కుమారుడు, కుమార్తెను బెంగళూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో కుమారుడు నాగచైతన్య మృతి చెందాడు. రహిత్య పరిస్థితి విషమంగానే ఉంది.

కుటుంబ కలహాలే కారణం

తన చెల్లెలు సుజాతను ఆమె భర్త సురేష్ మానసికంగా వేధించేవాడని రాములయ్య ఆరోపించారు. వివాహ వేడుకల్లో బంధువుల అందరి ముందు, ఆ తరువాత రాత్రి ఇంట్లో గొడవపడ్డాడని అన్నారు. అందుకే తీవ్ర మనస్తాపానికి గురైన సుజాత ఆత్మహత్యకు పాల్పడిందని కన్నీరు మున్నీరయ్యారు. తమ అల్లుడి వేధింపులు తట్టుకోలేకే కూతురు ఈ అఘాయిత్యానికి పాల్పడిందని సుజాత తల్లిదండ్రులు ఆరోపించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా ఆస్పత్రికి వెళ్లి విచారించారు. సుజాత సోదరుడు రాములయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


హెల్మెట్ ధరించి ర్యాలీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ప్లీజ్.. హెల్మెట్ ధరించండి

నగర ప్రజలకు ట్రాఫిక్ పోలీసుల అవగాహన
ధరించని వారికి పువ్వులిస్తూ సూచన


హెల్మెట్ ధరించాలని పువ్వు ఇస్తూ సూచిస్తున్న ట్రాఫిక్ పోలీస్

అనంతపురం క్రైం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'ప్లీజ్... హెల్మెట్ ధరించండి... రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోకుండా కాపాడుకోండి. కనీసం మీ కుటుంబ సభ్యుల కోసమైనా హెల్మెట్ వాడండి..' అని అనంతపురం ట్రాఫిక్ పోలీసులు నగర వాసులను కోరారు. గురువారం ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధరించి.. నగరంలోని ప్రధాన సర్కిళ్ల మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారికి పువ్వులు అందజేసి మరీ సూచించారు. ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్ మాట్లాడుతూ... ముందుగా ట్రాఫిక్ పోలీసుల నుంచే ఈ మార్పు రావాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. మరో రెండురోజుల పాటు అవగాహన కల్పిస్తామని, త్వరలోనే జరిమానాలు విధించే అవకాశముందని అన్నారు.

పోక్సో కేసు నమోదు

మడకశిరటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ బాలికను మాయమాటలు చెప్పి, తీసుకెళ్లిన పట్టణ పరిధిలోని బేగార్లపల్లికి చెందిన రాజేష్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. రాజేష్‌కు వివాహమై, ముగ్గురు పిల్లలున్నారు. మండలంలోని ఓ బాలికకు మాయమాటలు చెప్పి, ఈనెల 5వతేదీన తనతో తీసుకెళ్లినట్లు విచారణలో తేలిందన్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. బేగార్లపల్లి సమీప పొలాల్లో ఉన్న రాజేష్‌ను పట్టుకున్నామన్నారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గోడుం పట్టదా..!


అరకొరగా నిర్మించిన ప్రహరీ



అపరిచితులు వర్సిటీలోకి వస్తున్నారని ఆందోళన చేస్తున్న విద్యార్థులు

- ప్రహరీ లేని సెంట్రల్ యూనివర్సిటీ
- నిధులు మంజూరు చేయని గత ప్రభుత్వం
- ఆగిన నిర్మాణ పనులు
- అపరిచిత వ్యక్తులు వస్తున్నారంటూ విద్యార్థినుల ఆందోళన

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీలో భద్రత కరువైంది. దాదాపు రూ.270 కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తున్నా.. రూ.10 కోట్ల అంచనాతో తెలపెట్టిన ప్రహరీ నిర్మాణం మాత్రం కొన్ని సంవత్సరాల తరబడి కొనసాగుతూనే ఉంది. వర్సిటీ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఎవరు వస్తున్నారో.. ఎవరు పోతున్నారో.. అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆకతాయిలు, దొంగలు చొరబడి అలజడి రేపుతున్నారు. బాలికల హాస్టల్‌లోకి వెనుక వైపు నుంచి అపరిచత వ్యక్తులు వస్తున్నారంటూ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని మంగళవారం రాత్రి కూడా విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. స్పందించిన వీసీ ఏఎస్‌ఏ కోరి విద్యార్థులతో మాట్లాడి ఆందోళనలను విరమింపజేశారు.

ఏళ్లు గడుస్తున్నా...

కేంద్ర ప్రభుత్వ సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలంటే అందుకు తగిన భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించి ప్రహరీని నిర్మించాలి. ఈ షరతుకు కట్టుబడి నాటి టీడీపీ ప్రభుత్వం 2018లో రూ.10కోట్ల అంచనాతో సెంట్రల్ యూనివర్సిటీ ప్రహరీ నిర్మాణానికి టెండర్లు పిలిచింది. ఈ క్రమంలోనే 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నాటి నుంచి సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం ముసురుకుంది. 2018 ఆర్థిక


ప్రహరీ గుర్తుగా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు

సంవత్సర బడ్జెట్‌లో వర్సిటీ శాశ్వత భవనాల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల సద్వినియోగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అప్పటికే సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వర్సిటీ విద్యార్థులు తమకు శాశ్వత భవనాలు నిర్మించాలని పలుమార్లు ధర్నాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం కలుగచేసుకుని 2023 నుంచి శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టింది. అయినా ప్రహరీ నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ గోడ నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రహరీ నిర్మాణానికి తగిన నిధులను ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాలి

వర్సిటీ ప్రహరీని రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాలి. దాదాపు 500 ఎకరాల విస్తీర్ణంలో వర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. ఆవరణం చుట్టూ సుమారు సుమారు ఎనిమిది కిలోమీటర్లు ప్రహరీ నిర్మించాల్సివుంది. దీనిలో 4.5 కిలోమీటర్ల కాంపౌండ్ వాల్‌ను నిర్మించారు. మిగిలిన 3.5 కిలోమీటర్ల గోడను నిర్మించాల్సి ఉంది. ఈ నిర్మాణం ఎప్పటికి పూర్తి అవుతుందో చెప్పలేం. నిర్మాణం త్వరగా పూర్తి చేస్తే ఇతరులు వర్సిటిలోకి రాకుండా చేయవచ్చు. విద్యార్థినుల భద్రత దృష్ట్యా తగిన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశాం.

- ప్రొఫెసర్ ఎస్‌ఏ కోరి, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ

సంక్షిప్తం

నాలుగు నీటి సంఘాలకు ఎన్నికలు

శింగనమల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నాలుగు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య గురువారం తెలిపారు. శనివారం పోలింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిడ్ పెన్నార్ ఐదో దక్షిణ కాలువ కింద కల్లుమడి, తరిమెల సంఘాలకు, సలకంచెరువు, శింగనమల చెరువుల ఆయకట్టు సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. పకడ్బందీగా ఏర్పాట్లు, అవాంఛనీయ సంఘనలు జరగకుండా భద్రతా ఏర్పాటు చేశామని తెలిపారు.

నేడు మండల సమావేశం

శింగనమల, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ నిర్మలకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల సమావేశం నిర్వహిస్తామని స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు హాజరుకావాలన్నారు

ఎమ్మార్పీఎస్ స్థలాల పరిశీలన

అనంతపురం రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట గ్రామ సర్వే నెంబరు 41-1లో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు పట్టాలు ఇచ్చిన స్థలాలను ఆర్డీఓ కేశవనాయుడు గురువారం పరిశీలించారు. గతంలో పనిచేసిన సర్వేయర్లు నాలుగుసార్లు సబ్ డివిజన్ చేయడంతో సమస్యలు తలెత్తుతున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఇదేక్రమంలో ఈనెల 16న కలెక్టరేట్‌కు రావాలని, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆర్డీఓ చెప్పారని ఎమ్మార్పీఎస్ నాయకుడు బీసీఆర్ దాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్‌కుంట సూరి, నరసింహులు, మలరాయుడు, రాము, రామాంజి, శేఖర్, కొండయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేయాలి

● పుల్లలరేవు గ్రామస్థుల వినతి

రాప్తాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లలరేవు గ్రామంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు గురువారం తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. గొందిరెడ్డిపల్లిలో నిర్వహించే రెవెన్యూ సదస్సుకు పుల్లలరేవు గ్రామస్థులు చాలా మంది రాలేరని తెలిపారు. అందువలన పుల్లలరేవు గ్రామంలో కూడా రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమం లో గ్రామస్థులు గోపాల్, చెన్నారెడ్డి, అక్కులప్ప, రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీ కొన్న కారు



లారీని కారు వెనుక నుంచి ఢీ కొన్న దృశ్యం

గార్లదిన్నె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : లారీని కారు ఢీ కొన్న ప్రమాదంలో ప్రాణాపాయం తప్పింది. మండల పరిధిలోని తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం లారీని కారు ఢీ కొట్టింది. బెంగళూరుకు చెందిన గగన్, తేజ్, రాజు, అభయ్ అనే నలుగురు యువకులు మంత్రాలయం వెళ్లి తిరిగి బెంగళూరుకు వెళుతున్నారు. తిమ్మంపేట సమీపంలోకి రాగానే ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా నిలబడింది. దీంతో కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. అయితే ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కేసు నమోదు

అనంతపురం క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అశోక్‌నగర్‌లో ఓ వ్యక్తిపై జరిగిన దాడికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అశోక్ నగర్‌లోని మినర్వా స్కూల్ సమీపంలో అన్వర్‌సాధిక్, మహమ్మద్ నివాసముంటాడు. సోషల్ మీడియాలో పరువుకు భంగం కలిగించేలా పోస్టు చేశారనే వివాదంపై అరీఫా, సద్దాం, ఇలియాజ్, అంజుం పది రోజుల క్రితం తనపై దాడి చేశారని అన్వర్ సాధిక్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కరెంటు కోసం ఆందోళన

అనంతపురం రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలోని మల్లు స్వరాజ్యం కాలనీకి అక్రమంగా కరెంటు లైన్ కట్ చేసిన డి-6 విద్యుత్ అధికారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. సీపీఎం నాయకులు ప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం కాలనీ వాసులు అర్బన్ తహసీల్దార్ వద్ద ధర్నా చేపట్టారు. కాలనీకి సంబంధించిన లైన్ కట్ చేశారని, దీనిపై కరెంటు అధికారిని అడితే త్రీఫేస్ కనెక్షన్‌ను 2ఫేస్ కనెక్షన్‌గా మార్చినట్లు చెప్పారన్నారు. తమ ధర్నాతో తహసీల్దార్ చొరవ తీసుకుని త్రీఫేస్ కనెక్షన్ ఇవ్వాలని ఏఈకి సూచించారన్నారు. సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు వలి, మసూద్, వెంకట నారాయణ, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు వెంకట, వెంకటేష్, నూరుల్లా, షరీఫ్, నాగేంద్ర, అలీ, హాజీవలి, సూరి, శంషాద్, లాలెమ్మ, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

శిశువు మృతదేహం లభ్యం

కనగానపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతదేవరపల్లి కుంటలో ఓ గుర్తుతెలియని శిశువు మృతదేహం లభ్యమైంది. దాదాపు మూడు నెలలు ఉన్న ఓ శిశువు కుంటలో పడి ఉండటాన్ని అటుగా వెళ్తున్న గొర్రెల కాపరులు గుర్తించారు. గ్రామస్థులకు తెలియజేశారు. గ్రామస్థులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఎవరో ఇక్కడ పడేశారని అభిప్రాయపడ్డారు. శిశువు వివరాలు తెలియాల్సిఉంది.

అధికారులు, ఉద్యోగుల కొరత

● అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో కీలక పోస్టులు ఖాళీ
● వీఆర్వోలతో కాలం వెళ్లదీస్తున్న వైనం
● మూడు నెలలుగా ఇదే పరిస్థితి
● ప్రజాసేవలపై ప్రభావం



అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు

అనంతపురం రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల ప్రజా సేవలతో ముడిపడి ఉన్న తహసీల్దార్ కార్యాలయాలు అధికారుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో నిత్యం పనుల నిమిత్తం ఆ కార్యాలయాలకు వచ్చే ప్రజలు నిస్సహాయ స్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో పనులు జరగడం లేదని నిట్టూర్పు విడుస్తున్నారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ పరిస్థితి కనిపి స్తోంది. రూరల్, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాల్లో పలు కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్బన్ కార్యా లయంలో రెగ్యులర్ సర్వేయర్, ఆర్ఐతో పాటు సీనియర్ అసిస్టెంటు, జూనియర్ అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక రూరల్ కార్యాలయంలో డిప్యూటి తహసీల్దార్ పోస్టుతో పాటు జూనియర్ అసిస్టెంటు పోస్టు ఖాళీగా ఉంది. గత మూడు నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి. దీంతో గ్రామ రెవెన్యూ అధికారులే దిక్కుగా మారారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయాల్లోనే ఇలా ఉన్నా జిల్లా ఉన్నాతాధికారులు పట్టించుకోవడం లేదు. ఈ ప్రభావం కాస్త ప్రజలకు అందే సేవలపై పడుతోంది.

అర్బన్ కార్యాలయంలో...

అనంతపురం అర్బన్ కార్యాలయం పరిధిలో 50 డివిజన్లు, నాలుగు గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు రెండు లక్షలకు పైగా జనాభా ఉంది. వీరికి సేవలందించేందుకు తహసీల్దార్ కార్యాల యంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ తప్ప దాదాపు మిగిలిన సిబ్బంది ఎవరూ లేరు. ఇక్కడ ఉన్న ఉద్యోగులు గత మూడు నెలల కిందట జరిగిన బదిలీల్లో వెళ్లిపోగా, వారి స్థానాల్లో ఎవరినీ నియమించ లేదు. కార్యాలయంలో చాలా కీలకమైన సీనియర్ అసిస్టెంటు, జూనియర్ అసిస్టెంటు పోస్టులే ఖాళీగా ఉన్నాయి. దీంతో వార్డు సచివాలయాల్లో పనిచే స్తున్న వీర్వోలను కార్యాలయంలోని విధులకు ఉపయోగిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవాలందించాల్సిన వీఆర్వోలు కార్యాలయంలోని విధులకే పరిమితమైపోయారు. దీనికి తోడు ఉన్న వీఆర్వోల్లోనూ పదిమందికి పైగా వ్యక్తిగత సెలవుల్లో వెళ్లిపోయారు. దీంతో ఆయా వీఆర్వోల స్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టిన వీర్వోలు తీవ్ర పని ఒత్తిడికి లోనవుతున్నారు. అంతేగాకుండా మండల రెగ్యులర్ సర్వేయర్ ఆర్ఐ, లేకపోవడం మరింత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల అనంతపురం రూరల్ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సైతం ఈ సమస్యను జేసీ శివనారాణ్ శర్మ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై కలెక్టర్‌ను కూడా కలిసినట్లు ఆయా వర్గాలద్వారా తెలుస్తోంది. ఉన్న అధికారులను సైతం వేరే చోట్లకు పంపివేసి అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని పూర్తి మూసేస్తే బాగుంటుందంటూ ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

రూరల్ కార్యాలయంలోనూ...

ఇక రూరల్ కార్యాలయం పరిస్థితి కూడా దుస్థితి ఏమాత్రం తీసిపోదు. కార్యాలయం పరిధిలో 21 పంచాయతీలున్నాయి. దాదాపు రెండులక్షల వరకు జనాభా ఉంది. అయితే కార్యాలయంలో అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు లేరు. డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండి దాదాపు మూడు నెలలు దాటింది. బదిలీల్లో ఇక్కడకు నియమించిన వారు పాతస్థానాలకే వెళ్లిపోయారు. దీంతో డీటీ పోస్టు ఖాళీగా ఉంది. ఇక జూనియర్ అసిస్టెంట్ పోస్టు అలాగే ఉంది. మూడునెలల కిందట బదిలీల్లో భాగంగా కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఓ ఉద్యోగిని నియమించారు. అయితే ఆయన తిరిగి డిప్యూటేషన్‌పై పాతస్థానానికే వెళ్లిపో యారు. అధికారులు, ఉద్యోగులు లేకపోవడంతో వీ ఆర్వోలు కార్యాలయంలోని పనులు చేస్తున్నారు. ఇక్కడ కూడా ఐదారుగురు వీఆర్వోలు వ్యక్తిగత దీర్ఘ కాలిక సెలవుల్లో వెళ్లిపోయారు. ఈనేపథ్యంలో ఉన్న వారిపై అదనపు భారం పడుతోంది. ఇలా తహసీల్దార్ కార్యాలయాల్లో కీలకపోస్టులు ఖాళీగా ఉండటంతో ఇటు అధికారులు..అటూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల గురించి ఉన్నతాధికారులకు నివేదించాం. అధికారులు, ఉద్యోగులు లేకపోయినప్పటికీ ప్రజలకు అందించే సేవల్లో ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- హరికుమార్, అర్బన్ తహసీల్దార్,
మోహన్‌కుమార్, రూరల్ తహసీల్దార్

రాజకీయాలకు అతీతంగా ఎన్నికలు జరగాలి

● ఎమ్మెల్యే పరిటాల సునీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాప్తాడు నియోజకవర్గంలో ఈ నెల 14వ తేదీ నుంచి జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలు రాజకీయాలకు అతీతంగా జరగాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఆమె గురువారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. రాప్తాడు నియోజకవర్గంలోని 32 చెరువుల పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఇందులో అన్ని చోట్ల ఏకగ్రీవం చేసుకోవాలన్నారు. బలం లేకున్నా అనవసరంగా పోటీ చేసి, గ్రామాల్లో అలజడులు సృష్టించ వద్దన్నారు. ఆయకట్టు రైతులు ఈ విషయంలో ఆలోచించాలన్నారు. ముఖ్యంగా సాగునీటి వనరుల కోసం కృషి చేసే వారినే ఎన్నుకోవాలన్నారు. ఎక్కడా రాజకీయాలకు తావు లేకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

పాఠశాలకు రూ.లక్ష విరాళం



రూ. లక్ష విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే

రాప్తాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎమ్మెల్యే పరిటాల సునీత రూ. లక్ష విరాళం అందజేశారు. ఇటీవల రాప్తాడు ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లితండ్రులు-ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే... విద్యార్థుల అభివృద్ధి కోసం రూ. లక్ష ఇస్తామని ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు గురువారం అనంతపురంలోని తమ క్యాంపు కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ సాకే తిరుపాలు సమక్షంలో పాఠశాల హెచ్ఎం సాంబశివకు రూ. లక్ష చెక్కును అందచేశారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే విద్యాశాఖా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీహెచ్‌ను కలిసిన ఎమ్మెల్యే



వి హనుమంతరావుతో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హనుంతరావును ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కలిశారు. అయ్యప్ప మాల దీక్ష ముగించుకున్న ఎమ్మెల్యే గురువారం ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయలుదేరారు. హైబరాద్‌లోని ఎయిర్ పోర్టులో వి. హనుమంతరావు కనిపించడంతో ఆయన్ను పలుకరించారు. ఆయన ఎమ్మెల్యేతో ఆప్యాయంగా మాట్లాడి, జిల్లాలో రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు.

డ్రగ్స్ జోలికెళ్లొద్దు : సీఐ

అనంతపురం క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని త్రీటౌన్ సీఐ శాంతిలాల్ విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక అక్షర జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వాడకం-దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ హాజరై ఎవరైనా పట్టుబడితే వదలమని హెచ్చరించారు.

నాణ్యత లోపిస్తే చర్యలు: డ్వామా పీడీ

శింగనమల, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన గోకులం షెడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే అధికారులపై చర్యలు తప్పవని డ్వామా పీడీ సలీంబాష హెచ్చరించారు. ఆయన గురువారం మండలంలోని ఆకులేడు, లోలూరు గ్రామాల్లో గోకుల షెడ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. అలాగే జన జాతీయ ఉన్నత గ్రామ అభియాన్ పథకం కింద అభివృ ద్ధి పనుల ప్రణాళికలు తయారు చేయడానికి నాగులగుడ్డం తండా, నాగులగుడ్డం గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ నిర్మల కుమారి, ఏపీఓ శ్రీదేవి, ఉపాధి సిబ్బంది నారాయణస్వామి, ఓబిలేసు, హరి, శ్రీనివాసులు , అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి: జడ్పీ సీఈఓ

రాప్తాడు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి రెండో రోజు గురువారం ఆయన హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలన్నారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి

శింగనమల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధి లక్ష్యంగా అధికారులు పనిచేయాలని డీఎల్‌డీఓ లలితాబాయి పెర్కొన్నారు. గ్రామాభివృద్ధి లక్ష్యాలపై స్థానిక మండలరిషత్ కార్యాలయంలో గురువారం అధికారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఎల్‌డీఓ లలితాబాయి, డివిజన్ పంచాయతీ అధికారి సమన జయంతి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలకుమారి, ఈఓపీఆర్‌డి వెంకటలక్ష్మి, ఏఓ నాగభూషణరెడ్డి, సీహెచ్‌ఓ గంగాధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో రైతులకు అన్యాయం

● పలు కార్పొరేషన్‌ల డైరెక్టర్ల ఆగ్రహం

అనంతపురం అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రైతులకు తీరని అన్యాయం చేశారని పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు మండిపడ్డారు. అనంతపురంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో గురువారం పద్మశాలి, వాల్మీకి, రజక కార్పొరేషన్ల డైరెక్టర్లు పోతుల లక్ష్మీనర సింహులు, పీఎల్ఎన్ మూర్తి, పరమేశ్వరన్, రజక చైతన్య సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు రైతుల పక్షపాతి అన్నారు. గత వైసీపీ హయాంలో రైతులకు తీరని అన్యాయం చేశారన్నారు. జిల్లాలో వైసీపీ గల్లంతవుతోందన్న భయంతో ఆ పార్టీ నాయకులు రైతుల మాటున రాజకీయం చేస్తున్నారన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లను పక్క రాష్ట్రం తిరస్కరిస్తే.. రాష్ట్రంలో బిగించిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. రైతులకు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు రూ. 20వేలను తప్పక అందిస్తుందని వారన్నారు.

ఎన్‌డీపీఎస్ కోర్టును తరలిస్తే ఇబ్బందులు

● బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌డీపీఎస్ పరిధిలోని కేసులను విచారించే కోర్టును తరలించడం ద్వారా లాయర్లు, పోలీసులు, కక్షిదారులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని బహుజన లాయర్స్ ఫోరం (బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు బానాసి నారాయణప్ప పేర్కొన్నారు. ఎన్‌డీపీఎస్ కోర్టు తరలింపును వ్యతిరేకిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాయర్ నారాయణప్ప మాట్లాడారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ అడ్వైజర్ కమిటీ చైర్మన్, మాజీ న్యాయాధికారి కిష్టప్ప, జిల్లా అధ్యక్షుడు మూర్తి, ప్రధాన కార్యదర్శి మహేశ్వరి, ఉపాధ్యక్షులు అజీజ్, శ్రీనివాసులు, కార్యదర్శి రవికుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక వార్షిక వేతనంతో ఉద్యోగాలు

● జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ విద్యార్థులకు అత్యధిక వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాలు కల్పిస్తున్నా మని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను గురువారం వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ఓఎస్డీటూ వీసీ దేవన్న అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన మూడునెలల్లోనే అనేక ప్రాంగణ నియామకాలు చేపట్టామన్నారు. టీసీఎస్, సీటీఎస్, ఫ్యాక్ట్‌సెట్, డెల్లాఎక్స్, మోషిప్, ఎల్అండ్‌టీ తదితర ప్రముఖ సంస్థలతో ఎంఓయూ చేసుకున్నట్లు తెలిపారు. తొలిసారి ఇంటర్వ్యూల్లోనే ప్రతిభ కనబరస్తూ రూ.10 లక్షల నుంచి రూ.12లక్షల వార్షిక వేతనంతో విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. టీసీఎస్‌లో 121, ఎల్అండ్ టీలో 11, సీటీఎస్‌లో 9, ఫ్యాక్ట్ టెస్ట్‌లో 6, మోషిప్‌లో ముగ్గురు చొప్పున మొత్తం 150మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. సంస్థలకు అవస రమైన విధంగా విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పించి మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించడంతో వారిలోని మానసిక భయాందోళనలు తొలగిస్తున్నట్లు తెలిపారు. తద్వారా మొదటి ఇంటర్వ్యూల్లోనే ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టుల నిర్వహణ సమయంలోనే ప్రాంగణ నియామకాలు చేపట్టడం ద్వారా డిగ్రీతో పాటు ఉద్యోగాలతో విద్యార్థులు వెళ్తున్నారని హర్షం వ్యక్తంచేశారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, డైరెక్టర్ కిరణ్మయి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, ప్రాంగణ నియామకాల అధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి

●బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్

అనంతపురం రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని శ్రీబాలాజీ విద్యాంస్థల చైర్మన్ పల్లె కిశోర్ పేర్కొన్నారు. మండలపరిధిలోని ఆలమూరు సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల అసోసియేట్ డీన్ ఎస్ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విద్యా సంస్థల చైర్మన్ పల్లె కిశోర్, విశ్రాంత డీజీపీ శంకర్ రెడ్డి, విశాంత్ర శాస్త్రవేత్త ప్రొఫెసర్ శివానంద, వ్యవసాయ కళాశాల డీన్ రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ప్రస్తుతం ఉద్యాన కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాల న్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. గెలుపొందిన వారికి ముఖ్యఅతితుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లె కిశోర్



నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



పుష్పాభిషేకం చేస్తున్న భక్తులు

సాయినాథుడికి పుష్పాభిషేకం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మార్గశిర శుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో పుష్పాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. బాబా మూలవిరాట్‌ను విశేషంగా అలంకంకరించి, వివిధ రకాల పూలతో అభిషేకించారు. ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళహారతి నివేదన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వైకుంఠం జయచంద్ర చౌదరి, కార్యవర్గం రవీంద్ర నాథ్, నాగానందం, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, కృష్ణమూర్తి, భార్గవకృష్ణ, రాఘవేంద్ర గుప్త, భక్తులు పాల్గొన్నారు.



పుష్పాభిషేకంలో పాల్గొన్న భక్తులు

టీడీపీ సభ్యత్వాలకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న భక్తవత్సలం



విరాళం అందజేస్తున్న రామకృష్ణ

అనంతపురం అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పేదల టీడీపీ సభ్యత్వ నమోదు కోసం ఇద్దరు నాయకులు రూ. లక్ష విరాళం ఇచ్చారు. స్థానిక టీడీపీ అర్బన్ కార్యాలయంలో గురువారం టీడీపీ రాష్ట్ర నాయకుడు గంగారామ్‌కు 31వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకుడు రామకృష్ణ రూ.50వేలు, రుద్రంపేటకు చెందిన టీడీపీ నాయకుడు భక్తవత్సలం రూ.50వేలు విరాళం అందజేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ సానుభూతి పరులుగా ఉన్న పేదలతో సభ్యత్వం చేయించేందుకే విరాళం ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుగ్గయ్య చౌదరి, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, మణికంఠబాబు, కాకర్ల ఆదినారాయణ, కాశీ విశ్వనాథ్, శ్రీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

అనంతపురం విద్య, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులపై ఐసీడీఎస్, డీఎంహెచ్ఓ శాఖల ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కాలేజ్‌లో అవగా హన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... బాల్య వివాహాలు చేయకూడదని సూచారు. ముఖ్యంగా అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే పెళ్లిళ్లు చేయాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నా రు. ఐసీడీఎస్, డీఎంహెచ్ఓ కార్యాలయాల సిబ్బంది సంధ్యారాణి, చంద్రకళ, వేణుగోపాల్, ఆశరాణి, సంజీవ, వెంకట్‌కుమార్, శ్రీదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేద్దాం : మేయర్

అనంతపురం క్రైం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : రైతాంగ సమస్యలపై వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని నగర మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. మేయర్ గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఏడాదికి రూ.20వేలు వేస్తామని అధికారంలో కి వచ్చి అర్నెల్లవుతున్నా ఇవ్వకుండా మోసం చేశారన్నారు. శుక్రవారం జెడ్పీ కార్యా లయం నుంచి కలెక్టరేట్ వరకు జరిగే ర్యాలీలో అందరూ పాల్గొనాలని కోరారు.

పట్టాలిప్పిస్తామని డబ్బు తీసుకున్నారు

● అడిగితే దాడి చేశారని ఫిర్యాదు

అనంతపురం క్రైం,డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టాలిప్పిస్తామని డబ్బు తీసుకున్నారని...ఇవ్వమని అడిగితే దాడి చేశారని బాధితులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టాలిప్పిస్తామని అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన నాగభూషణ, ఈడిగ వెంకటేష్ అనే వారు బుక్కరాయ సముద్రం మండలం జనచైతన్య కాలనీకి చెందిన షెక్షావలి, శివకుమార్, మహబూబ్‌బాషాకు చెప్పారు. ఉప్పరపల్లి సర్వేనంబరు 215లో పట్టాలిప్పిస్తామని చెప్పి రూ.1.81,500 తీసుకున్నారు. కానీ పట్టాలిప్పించలేదు. దీంతో నిలదీయడంతో అక్టోబరు 24న టీవీ టవర్ వద్దకు వస్తే డబ్బు ఇస్తామని చెప్పి షెక్షావలిని పిలిపించారు. డబ్బు ఇవ్వకుండా నాగభూషణ, ఈడిగ వెంకటేష్, హుస్సేన్‌పీరా, రాధిక, పెద్దన్న, విజయలక్ష్మి, కిష్టమ్మ తనపై దాడి చేశారని షెక్షావలి తదితరులు ఫిర్యాదులో చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రణాళికతో ఉన్నతస్థాయికి..

అనంతపురం రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): క్రమబద్ధమైన పరిశోధనల ప్రణాళిక, మేధో సంపత్తి, హక్కుల జ్ఞానం ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నాగభూషణ్ రాజు అన్నారు. స్థానిక పీవీకేకే ఐటీ కళాశాలలో గురువారం పరిశోధన, అభివృద్ధి, మేధోసంపత్తి హక్కుల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆయా అంశాలపై నిపుణుల ఉపాన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ నాగభూషణ్ రాజు, పరిశోధన అభివృద్ధి డీన్ శ్రీనివాసన్ హాజరయ్యారు. పరిశోధనలు, ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడేవిధంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐపీఆర్‌సెల్ కన్వీనర్ చెన్నకేశవులు, కో-కన్వీనర్ చిత్ర, పరిశోధన, అభివృద్ధి కోకన్వీనర్ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

విద్యుత్ చార్జీలను తగ్గించాలి: సీపీఎం

గుంతకల్లుటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద గురువారం విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి పెద్దలు అధికారం చేపట్టిన తరువాత ట్రూఅప్ చార్జీల పేరట రూ.29వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం దారుణమన్నారు. విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సురేంద్ర, జ్యోతి, అబ్దుల్లా, ఓటులేసు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

పామిడి: రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సీపీఎం నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులనే కూటమి ప్రభుత్వమూ చేస్తోందన్నారు. ట్రూ అప్ చార్జీల వసూళ్లు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ప్రభుత్వం మాటతప్పిందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భాస్కర్, సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, కమిటీ సభ్యులు ముత్యాలు, శంకర్, నాగరాజు, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించిన ఏఎస్పీ

గుత్తి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌ను ఏఎస్పీ ఇలియాజ్ గురువారం పరిశీలించారు. దశాబ్దల కిందట నిర్మించిన క్వార్టర్స్ భవనాలు శిథిలావస్థకు చేరకున్నాయి. వాటిస్థానంలో నూతన భవనాలు నిర్మించేందుకు తగు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఫుట్‌బాల్ క్రీడామైదానం సమీపంలో శిథిలావస్థలో ఉన్న సీఐ కార్యాలయ స్థలంను ఆయన పరిశీలించారు. ఎస్ఐ సురేష్, సిబ్బంది ఉన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

శెట్టూరు: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తనిఖీ చేశారు. అక్కడ అపరిశుభ్రతపై ఎస్ఐ రాంభూపాల్ యాదవ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

గుత్తి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. గౌతమి పురి వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి రాజీవ్, గాంధీ సర్కిళ్ల మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వికలాంగుల భవనంలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శివాజీరెడ్డి, మున్సిపల్ మేనేజరు రాంబాబు, టీడీపీ పట్టణ కన్వీనర్ ఎంకే చౌదరి, ఆ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి వెంకటేష్, నాయకులు రవి, రంగయ్య, లక్ష్మీనారాయణ, ముత్యాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

గుత్తి,డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మీడియా ప్రతినిధులపై దాడి చేసి చేసిన సినీ నటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని మండలంలోని పాత్రికేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. తొలుత గాంధీ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. వారికి సీపీఐ నాయకులు మద్దతు పలికారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ కార్యదర్శి శేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఎల్లప్ప, సీపీఐ మండల కార్యదర్శి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం తనిఖీ

గుత్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తికొనుగోలు కేంద్రాన్ని అనంతపురం మార్కెటింగ్ అసిస్టెండ్ డైరెక్టర్ సత్యనారాయణచౌదరి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తి నాణ్యతను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గతనెల 22న పత్తికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకుని శ్యాంపుల్‌ను మార్కెట్ యార్డుకు తీసుకువస్తే సిబ్బంది నాణ్యతను పరిశీస్తారన్నారు. రైతు దగ్గర ఎంత పత్తిఉన్నా కొనుగోలు చేస్తామన్నారు. పత్తి విక్రయించిన రైతులకు వారం రోజులోపు వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని పేర్కొన్నారు. రైతులు పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మార్కెట్ యార్డు కార్యదర్శి బాలాజీరావు, తదితరులుపాల్గొన్నారు.

మొక్కజొన్న యంత్రంలో పడి తీవ్రగాయాలు

బొమ్మనహాళ్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో మొక్కజొన్న యంత్రంలో పడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన యర్రగుడి వన్నూరుస్వామి గ్రామ శివారులోని వన్నప్పకు చెందిన పొలంలోకి మొక్కజొన్న నూర్పిడి కోసం బుధవారం సాయంత్రం వెళ్లాడు. వజ్రకరూరు మండలం గంజిగుంట గ్రామానికి చెందిన రాజు యంత్రంతో మొక్కజొన్న నూర్పిడి చేస్తుండగా యంత్రంపై ఉన్న వన్నూరుస్వామి చైన్ లింక్‌లో పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బళ్లారి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణం అయిన రాజు యంత్రంతో పరారైనట్లు బాధితుడి బంధువులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

రూ.10 వేలు ఆర్థికసాయం

కళ్యాణదుర్గం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న దళిత యువకుడు రామాంజనేయులకు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ రూ. 10 వేలు ఆర్థికసాయాన్ని గురువారం అందించారు. శెట్టూరు మండలం ఐదుకల్లుకు చెందిన నిరుపేద దళిత యువకుడు రామాంజనేయులుకు మెదడులో రక్తం గూడు కట్టుకుని ఆరోగ్యం విషమించడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆ గ్రామానికి చెందిన యువకులు వెళ్లి సాయం చేయాలని బద్దేనాయక్‌ను కోరారు. దీంతో వెంటనే ఆయన రూ. 10 వేలు ఆర్థికసాయాన్ని యువకులను అందజేశారు.

ఘనంగా హనుమద్ జయంతి

యల్లనూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలమకూరు ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండురోజుల పాటు జరిగే వేడుకల్లో తొలిరోజు ఉదయం అర్చకులు స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రెండోరోజు శుక్రవారం ఉదయాన్నే స్వామికి అభిషేక పూజలు చేస్తారని, అనంతరం ఎద్దుల పోటీలు, అన్నదానం, రాత్రి పౌరాణిక నాటకం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు బయ్యపురెడ్డి తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ప్రభుత్వ విప్ కాలవ

గుమ్మఘట్ట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని కలుగోడు గ్రామంలో రూ. 34 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్డును గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం గ్రామంలోనే ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గతంలో వైఎస్ జగన్ అరాచకపాలనతో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ముఖ్యంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి వాటితో రైతులు రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. గతంలో జరిగిన రెవెన్యూ అక్రమాలను వెలికితీసేందుకే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రతి ఒక్కరూ వినియోగించుకుని భూ సమస్యల్ని పరిష్కరించుకోవాలని సూచించారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గిరిమల్లప్ప, డీ.హీరేహాళ్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, రాయదుర్గం కన్వీనర్ హనుమంతు, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామకృష్ణ, పీఆర్ డీఈ సుధాకర్‌నాయక్, ఏపీఓ సురేష్, ఎంపీపీ భవాని, మాజీ సర్పంచ్ మోహన్‌రంగ, డిప్యూటీ తహసీల్దార్ రఘు, ఇతర అధికారులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

రూ.5 వేల కోట్ల అభివృద్ధి పనులకు హామీ

రాయదుర్గం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లో నియోజకవర్గంలో రూ. ఐదువేల కోట్ల అభివృద్ధి పనులకు హామీలను సాధించుకోగలిగామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన ఆరునెలల ప్రగతి నివేదికను విడుదల చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లో నియోజకవర్గానికి రావడం అదృష్టమన్నారు. ఆయన ప్రజావేదికలో ప్రకటించిన అభివృద్ధి పనుల



రిబ్బన్ కట్ చేసి సీసీరోడ్డును ప్రారంభిస్తున్న విప్ కాలవ

విలువ రూ. ఐదు వేల కోట్ల వరకు ఉంటుందని స్పష్టం చేశారు. వీటిలో అత్యంత ప్రధానంగా జీడిపల్లి నుంచి భైరవానతిప్ప ప్రాజెక్టుకు నీరు తీసుకువచ్చే పథకాన్ని ఖచ్చితంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే తుంగభద్ర ఎగువకాలువ ఆధునీకరణ పూర్తి చేస్తానని చెప్పారని గుర్తు చేశారు. అత్యవసరంగా చేపట్టాల్సిన రూ.35 కోట్ల పనులకు ఇప్పటికే పాలన ఆమోదం పొందామన్నారు. కణేకల్లు-మాల్యం మధ్యలో రూ.48కోట్ల వ్యయంతో చేపట్టే వంతెన నిర్మాణ పనులకు ఇప్పటికే భూమిపూజ చేశామన్నారు. అర్ధంతరంగా ఆగిపోయిన గోనబావి బీసీ బాలికల ఆశ్రమ పాఠశాల పనులను రూ. 24.5 కోట్ల ఖర్చుతో మళ్లీ ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నామన్నారు. రూ. 16 కోట్లతో ఉపాధిహామీ నిధులతో గ్రామాలలో సీసీరోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. ఆగిపోయిన రెండు రైల్వే వంతెనల ఫైళ్ల కదలికను చేపట్టామన్నారు. ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణానికి సీఎం స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే డీ.హీరేహాళ్-బొమ్మనహాళ్ మధ్యలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నామని, అభివృద్ధిని రాయదుర్గం నియోజకవర్గంలో పరుగులు పెట్టిస్తామని, ప్రజల నమ్మకానికి తగిన విధంగా ముందుకు వెళతామని కాలవ పేర్కొన్నారు.

నేడు, రేపు మెగా జాబ్‌మేళా

● నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని
ఎమ్మెల్యే అమిలినేని సూచన

కళ్యాణదుర్గం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ఈ నెల 13, 14వ తేదీల్లో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. స్థానిక దొడగట్ట రోడ్డులో ఉన్న జ్ఞానభారతి పాఠశాలలో 200 కంపెనీ ప్రతినిధులతో ఈ మెగాజాబ్ మేళాను నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికే సుమారు 8 వేల మంది నిరుద్యోగులు ఈ మెగాజాబ్ మేళాకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో పర్యటించినప్పుడు ఇక్కడ యువత ఉద్యోగాలు లేక పడుతున్న కష్టాలు తాను గుర్తించానన్నారు. అందుకోసమే వారికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో మెగాజాబ్ మేళాను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరో రెండు నెలల్లో కూడా ఇలాగా మరో మెగాజాబ్ మేళాను నిర్వహిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని పేర్కొన్నారు. మెగాజాబ్‌మేళాను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ

కళ్యాణదుర్గం: పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గురువారం డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విజయవాడ నుంచి రెండు ప్రత్యేక వాహనాలలో డీఎస్సీ మెటీరియల్ ప్రజా



హాస్టల్లో విద్యార్థినుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అమిలినేని

వేదిక వద్దకు చేరాయి. దీంతో అభ్యర్థులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.18 లక్షలు సొంత నిధులు ఖర్చుచేసి వెయ్యి మంది అభ్యర్థులకు ఉచితంగా మెటీరియల్‌ను అందజేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరు బాగా చదువుకుని ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాల తనిఖీ

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని దొడగట్ట రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, వసతి గదులు పరిశీలించారు. సమస్యలున్న గదులను సెలవులు ఉన్న రోజుల్లో బాగు చేయిస్తామని తెలిపారు. మెయిన్ గేటును రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. వసతి గృహాల్లోని సమస్యలు మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఐదుగురి అరెస్టు

తాడిపత్రి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణాపురం జీరోరోడ్డులో ఈనెల 7న జరిగిన గొడవకు సంబంధించి చాకలి అమర్‌నాథ్ అలియాస్ అమర్, శశికిరణ్, గాండ్లపాడు అజయ్, వరుణ్, సాయిసోముశ్రీనాథ్ అలియాస్ సోమశేఖర్‌ను గురువారం అరెస్టుచేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. ఈనెల 7న కృష్ణాపురం జీరోరోడ్డులో గంగమ్మ ఆలయం సమీపంలో బేల్దారి మేస్త్రీ అయిన శంకరనారాయణ, మల్లెల నాగేంద్ర, సుబ్బరాయుడులపై అమర్‌నాథ్, శశికిరణ్, అజయ్, వరుణ్, సాయిసోముశ్రీనాథ్‌లు దాడి చేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అందిన సమాచారం మేరకు పట్టణంలోని శివాలయం రోడ్డులో ఉన్న ఐదుమందిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో మరో నలుగురిని అరెస్టు చేయాల్సి ఉందని సీఐ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, జాబ్‌ను రెగ్యులర్ చేయాలని అన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, రంగనాయకులు, హనమంతు, లింగమూర్తి, దాసు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల ధర్నా

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు, పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. సమానపనికి సమాన వేతనం కల్పించాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ వెం టనే ఇవ్వాలన్నారు. కార్మికులకు పనిముట్లు, రక్షణ పరికరాలు అందజేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

కణేకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళేకుర్తి గ్రామానికి చెందిన టీడీపీ యువనాయకుడు బోయ వంద్రప్ప(38) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న విప్ కాలవ శ్రీనివాసులు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అలాగే కాలవ భరత్ కళేకుర్తికి చేరుకుని వంద్రప్ప భౌతికకాయ్నా సందర్శించి నివాళులు అర్పించారు. మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు కళేకుర్తి సుదర్శన్, ఆది, బసవరాజు, అనిల్ తదితరులు నివాళులు అర్పించారు.

బెంగళూరులో రోడ్డు ప్రమాదం

● శెట్టూరు వాసి దుర్మరణం

శెట్టూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బోయ లక్ష్మీనారాయణ బెంగళూరుతో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కొన్నేళ్లుగా బెంగళూరులోని ఒక కోళ్లఫామ్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే గురువారం తెల్లవారుజామున ఫామ్ నుంచి లోడ్ తీసుకుని వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో వారందరూ శోకసంద్రంలో మునిగిపోయారు.

సైబర్ నేరాలపై అవగాహన

పామిడి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ శ్రీరాఘవేంద్ర అవగాహన కల్పించారు. బ్యాంకులో ఒకేషనల్ విద్యార్థులకు గురువారం సైబర్ క్రైం, బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. బ్యాంకులో ఎవరెవరు ఏయే విధులు నిర్వహిస్తారన్నది మేనేజర్ వివరించారు. ప్రిన్సిపాల్ సుభద్ర, ఒకేషనల్ స్టాఫ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహం.. నేరం

గుంతకల్లుటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేయడం నేరమని బాలల పరిరక్షణ అధికారి వెంకటేశ్వరి పేర్కొన్నారు. పట్టణంలోని నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులకు గురువారం ఆమె జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాలల హక్కులు, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిన్నపిల్లలు,అమ్మాయిలపైన దాడులు అధికంగా జరుగుతున్నాయన్నారు. విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, డాక్టర్ సజీవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

కణేకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు మండల వ్యాప్తంగా చురుగ్గా సాగుతోంది. ఈ క్రమంలో గురువారం మండల కేంద్రంలోని 132వ బూత్‌లో బూత్ కన్వీనర్ ఫక్రుద్దీన్, నాయకుడు ఎంసీ వలి ప్రజల వద్దకు వెళ్లి పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టారు. పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లులో మాజీ ఎంపీటీసీ కెంచప్ప, టీడీపీ నాయకులు ఖాసీం, దేవగిరి వన్నూరుస్వామి పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



పవన్‌కుమార్ (ఫైల్)

రాయదుర్గంరూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పవన్‌కుమార్(35) చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన పవన్‌కుమార్ బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో గల రుక్మిణీ పాండురంగస్వామి దైవదర్శనానికి బైక్‌పై వెళుతుండగా నాగిరెడ్డిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న పాలవ్యాన్ ఢీ కొంది. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడగా స్థానికులు కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నా రు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గంగాధర్ (ఫైల్)

రాయదుర్గంరూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రస్తా వివాదంపై జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర(26) గురువారం మృతి చెందాడు. మండలంలోని చదం గ్రామంలో డోణప్ప కుమారుడైన గంగాధర్‌కు, డోనప్ప తమ్ముళ్లు చిన్న గంగప్ప, పెద్దగంగప్ప కుమారులైన శీన, సూర్య, వంశీకి రస్తా వివాదం నడుస్తోంది. అయితే గత బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వివాదాన్ని మనస్సులో పెట్టుకుని వారందరూ పొలంలో పనిచేస్తున్న గంగాధర్‌తో గొడవకు దిగి కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. కుటుంబసభ్యులు రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. అనంతరం బళ్లారి ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం.. ఫిర్యాదు

కుందుర్పి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక గ్రామానికి చెందిన 21 సంవత్సరాల వయసు గల మహిళ అదృశ్యమైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ నెల 7వ తేదీన మహిళ బహిర్భూమికి వెళ్లింది. ఆ తర్వాత ఇరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె తండ్రి మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

తాడిపత్రి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయస్వామి మాన్యంలో గురువారం హాజివలి, కమాల్‌బాషా, పెద్దిరాజు, వెంకటాద్రి, మదన్‌లు ఘర్షణపడ్డారు. వీరిలో కమాల్‌బాషా, హాజీవలికి గాయాలయ్యాయి. కమాల్‌బాషా, వెంకటాద్రి ఇంటి విషయంలో ఘర్షణపడ్డారు. వెంకటాద్రి, మదన్, పెద్దిరాజులు కలిసి హాజివలి, కమాల్‌బాషాలపై దాడి చేయడంతో గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

కర్మాగారం విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

బొమ్మనహాళ్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరేసముద్రం గ్రామపంచాయతీ పరిధిలో జిందాల్‌షా కర్మాగారం విస్తరణ, ఆధునికీకరణ, పర్యావరణ అనుమతులపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. 1994లో శాతవాహన ఇస్పాత్ కర్మాగారాన్ని నిర్మించారు. అయితే 2017లో అది మూతపడడంతో రెండేళ్ల క్రితం జిందాల్‌షా తీసుకుని పైపులు తయారు చేస్తున్నారు. మరికొంత భూమిని కొనుగోలు చేసి 140 ఎకరాల విస్తీరణంలో ఐరన్‌పైపు ప్లాంట్ కోసం కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు గాను గురువారం జిందాల్‌షా కర్మాగారం వద్ద కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, కర్నూలు కాలుష్య నియంత్రణ బోర్డు ఎస్ఈ శివశంకర్‌నాయక్, అనంతపురం ఈఈ మునిప్రసాద్, బొమ్మనహాళ్ తహసీల్దార్ మునివేలు కలిసి హరేసముద్రం, కురవళ్లి, బొమ్మనహాళ్, సిద్ధరాంపురం, చంద్రగిరి గ్రామాల ప్రజలతో పర్యావరణ అభిప్రాయ సేకరణ చేపట్టారు. దాదాపు 140 హెక్టార్లలో జిందాల్‌షా ఫ్యాక్టరీ విస్తరణకు, ఆధునీకరణకు దరఖాస్తు చేసుకుందని, దీంతో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామని అధికారులు తెలిపారు. దీంతో రైతులు, ప్రజల పక్షాన స్థానిక టీడీపీ నాయకులు కుమ్మరి మల్లికార్జున, కొత్తపల్లి మల్లికార్జున, పయ్యావుల అనిల్, పయ్యావుల నాగరాజు, సర్పంచ్ తిప్పేస్వామి, బీజేపీ నాయకుడు హీరోజీరావు మాట్లాడారు. ఫ్యాక్టరీ విస్తరణ, ఆధునీకరణను తాము అడ్డుకోమని, అయితే కంపెనీ వారు పరిసర గ్రామాలలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని, గ్రామాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని, రైతులకు పరిహారం ఇవ్వాలని, కంపెనీలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, పరిసర గ్రామాలలో భారీఎత్తున మొక్కలు పెంచి పర్యావరణకు కృషి చేయాలని కోరారు. ఆర్డీఓ వసంతబాబు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో బొమ్మనహాళ్, కణేకల్లు ఎస్ఐలు నబీరసూల్, నాగమధు, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తాడిపత్రి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గసమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని సుంకులమ్మపాలెంకు చెందిన రామతులసిరెడ్డి నంద్యాలజిల్లా కొలిమిగుండ్ల మండలానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా బుగ్గ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో బైక్ ప్రమాదవశాత్తూ ఢీకొంది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఆటోచోరీపై ఫిర్యాదు

తాడిపత్రి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చేపలమార్కెట్ సమీపంలో గురువారం తెల్లవారుజామున మల్లేష్‌కు చెందిన ఆటోను గుర్తుతెలియని దుండగులు అపహరించారు. ఈ మేరకు బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని పోలీసులు తెలిపారు.

వ్యవసాయ మోటార్ల కేబుల్ చోరీ

రాయదుర్గంరూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ మోటార్ల కేబుళ్లను దొంగిలించినట్లు రైతులు హేమచంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, అశోక్ పేర్కొన్నారు. పొలంలో వ్యవసాయ మోటార్లకు ఏర్పాటు చేసిన 175 మీటర్ల వైరును దుండగులు కట్ చేసుకుని ఎతుకెళ్లినట్లు తెలిపారు. దీని విలువ దాదాపు రూ. 30 వేలు ఉంటుందన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

కుందుర్పి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవోగా లక్ష్మీశంకర్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న హరికృష్ణ బాలాజీ రోడ్డు ప్రమాదం జరగ్గా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ఏవోగా పని చేస్తున్న లక్ష్మీశంకర్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓగా జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఆయన బాధ్యతలను చేపట్టారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

● పంచాయతీ కార్యదర్శికి ఎమ్మెల్యే అమిలినేని ఆదేశం

కళ్యాణదుర్గం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరేపల్లి ఎస్సీకాలనీలో తాగునీటి సమస్య ఉందని, పరిష్కరించాలని ఆ కాలనీ మహిళలు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వద్ద మొర పెట్టుకున్నారు. ఎమ్మెల్యే గురువారం ఆ కాలనీలో పర్యటించారు. విషయం తెలుసుకున్న మహిళలు ఆయన వద్దకు వెళ్లి సమస్య విన్నవించారు. ఏడాది నుంచి తమ కాలనీలో తాగునీటి సమస్య ఉందని, తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి వారం రోజుల్లోగా బోరు, మోటార్ ఏర్పాటుచేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన అక్కడే టమోటా గ్రేడింగ్ చేస్తున్న మహిళల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ని సజ్జలదిన్నె గ్రామ పొలాల్లో గురువారం పేకాట ఆడుతున్న 10మందిని అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.29 వేల నగదు, 52పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పేకాటస్థావరంపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 10 మందిపేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఉరవకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉరగాద్రి కల్యాణమండపంలో గురువారం సమైరా పాలీక్లినిక్, కిమ్స్ సవేర ఆస్పత్రి వారు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో కార్డియాలజీ, ఈఎన్టీ, ఆప్తాల్మిక్, యూరాలజీకి సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 600మంది వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు రామకుమార్, లహరి, అర్జున్, రంగస్వామి, సాక్షి, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి

కుందుర్పి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనగల్లు గ్రామంలో గురువారం భక్త కనకదాస జయంతి వేడుకల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాస చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో మహిళలు కలశాలతో పాల్గొన్నారు. గొరవయ్యలు ఢమరుకాలను మోగిస్తూ.. పిల్లనగ్రోవి ఊదుతూ నృత్యం చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్ ప్రాంతంలో ఉన్న అశ్వత్థ నారాయణ కట్ట వద్ద కలశాలతో తెచ్చిన గంగాజలాన్ని రావి, వేపచెట్లకు పోసి, కనకదాస చిత్రపటానికి విశేష పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు.



ఊరేగింపులో కలశాలతో పాల్గొన్న మహిళలు